సాక్షి
తిరుపతి
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



రోజుకో మెనూ..ఇష్టంగా తిను

ప్రస్తుత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలవుతోంది. రోజుకొక మెనూ అమలవుతోంది. - 8లో



వేధింపులతోనే రాజీనామా

టీడీపీ, జనసేన, బీజేపీ నేతల వేధింపులతోనే తాము రాజీనామా చేస్తున్నట్టు పలువురు వలంటీర్లు తెలిపారు. - 8లో



బైక్‌ను ఢీకొన్న లారీ

బైక్‌ను లారీ ఢీకొనడంతో మహిళా కండక్టర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన పెళ్లకూరు మండలంలో విషాదాన్ని నింపింది. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో తొమ్మిది కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,517 మంది స్వామివారిని దర్శించుకోగా, 27,788 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

చంద్రగిరి: చంద్రగిరిలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 26వ తేదీ నుంచి 45 రోజుల పాటు మహిళలు, పురుషులకు ఉచిత కంప్యూటర్ డెస్క్‌టాప్ పబ్లిషింగ్(డీటీపీ)పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు, పురుషులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీలు ఇస్తామని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని తెలియజేశారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ సమీపం) కొత్తపేట , చంద్రగిరి చిరునామాలో, 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించవచ్చని వివరించారు.

'శ్రీ సత్యసాయి' డీఐఓ కృష్ణయ్య గుండెపోటుతో మృతి



డాక్టర్ కృష్ణయ్య(ఫైల్)

ప్రశాంతి నిలయం: శ్రీసత్యసాయి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ కృష్ణయ్య శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన స్వస్థలం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద అద్దె గదిలో ఒంటరిగా నివాసముంటున్న ఈయన శుక్రవారం అర్ధరాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో నొప్పి మొదలవడంతో జిల్లా వైద్యాధికారితో పాటు సహచర ఉద్యోగులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆయనను సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పల్స్‌రేటు పడిపోయింది. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈఓ ఆకస్మిక తనిఖీ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఈవో ఎస్వీ నాగేశ్వరరావు పలు విభాగాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా అన్నదాన కేంద్రంలో అన్నప్రసాదాల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాహు-కేతు పూజా మండపాలు, ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కైలాస సదన్, గంగా సదన్, గోశాలలను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



అభివాదం చేస్తున్న బియ్యపు మధుసూదనరెడ్డి

జిల్లాలో నామినేషన్ల జాతర కొనసాగుతోంది. ఎక్కడ చూసినా ఎన్నికల హడావుడే కనిపిస్తోంది. మూడో రోజు శనివారం మొత్తం 20 మంది నామినేషన్లు సమర్పించారు. ఇందులో 17 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగుతున్నారు. చుర్రుమంటున్న ఎండను సైతం లెక్కచేయక అభ్యర్థులు తమ అనుచరులతో ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్లు సమర్పిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎన్నికల అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి నామినేషన్‌కు తరలివచ్చిన జనం

నామినేషన్ల జాతర

- జిల్లాలో మూడో రోజు 20 నామినేషన్లు దాఖలు
- ఇందులో 17మంది స్వతంత్ర అభ్యర్థులు
- పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల పర్వం ఊపందుకుంది. మూడో రోజు శనివారం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సుమారు 20 మంది నామినేషన్లను దాఖలు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సాయంత్రం 3గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. జిల్లాలోని అన్ని ఆర్వో కేంద్రాలు నామినేషన్లు వేసేందుకు తరలివచ్చిన అభ్యర్థులతో నిండిపోయాయి. జిల్లా కేంద్రంలోని తిరుపతి పార్లమెంట్‌తో పాటు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో, ఆర్వో కార్యాలయాల్లో నామినేషన్ దాఖలు చేయడానికి విచ్చేసిన అభ్యర్థులకు వెరిఫికేషన్ కౌంటర్, సెక్యూరిటీ డిపాజిట్ కౌంటర్ వంటి సదుపాయాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్వో కార్యాలయాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



శ్రీకాళహస్తి: నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పక్కన ఎంపీ, ఎమ్మెల్సీ



అభివాదం చేస్తున్న ఎంపీ గురుమూర్తి



నామినేషన్ వేసేందుకు తరలివెళ్తున్న సీపీఐ నేతలు

నామినేషన్ల వివరాలు

- తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం(ఎస్సీ) స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా వీసీ నవీన్‌గుప్తా వెలగపల్లి, బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా గుర్రప్ప పెనుమూరు నామినేషన్లను దాఖలు చేశారు.
- శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బియ్యపు మధుసూదన్ రెడ్డి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. మరో సెట్‌ను అదే పార్టీ తరఫున ఆయన సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీ.రాజేష్‌నాయుడు, స్వతంత్ర అభ్యర్థిగా తీగల భాస్కర్ నామినేషన్లు దాఖలు చేశారు.
- గూడూరు(ఎస్సీ) అసెంబ్లీ స్థానానికి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా అన్నెం మల్లికార్జున నామినేషన్ దాఖలు చేశారు.
- సూళ్లూరుపేట (ఎస్సీ) అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బురకాల లీలామోహన్ నామినేషన్ వేశారు.
- చంద్రగిరి అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా సీ.శ్రీచరణ్ నామినేషన్ వేశారు.
- తిరుపతి అసెంబ్లీ స్థానానికి సీపీఐ అభ్యర్థిగా పీ.మురళి, జైహిందూస్తాన్ పార్టీ అభ్యర్థిగా ఎం.నీలకంఠ నామినేషన్ దాఖలు చేయగా ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఆర్.కృష్ణచైతన్య, పెంచలప్రసాద్, కే.భార్గవ్, పాపిరెడ్డిగారి సోమశేఖర్‌రెడ్డి, ఎస్.నరేష్, నెల్లేపల్లి బెనర్జీ, పీ.సాయి ప్రసన్న కుమార్ నామినేషన్ దాఖలు చేశారు.
- సత్యవేడు (ఎస్సీ) అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా హెచ్.హేమలత నామినేషన్ వేశారు. వెంకటగిరి అసెంబ్లీ స్థానానికి శనివారం ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఎంపీ అభ్యర్థి చింతామోహన్ బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1,974



తిరుపతి అర్బన్ : తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థిగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున డాక్టర్ చింతామోహన్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తాను సమర్పించిన అఫిడవిట్‌లో బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1,974గా చూపారు.

అభ్యర్థి పేరు : చింతా మోహన్
పార్టీ : ఇండియన్ నేషనల్ కాంగ్రెస్
విద్యార్హత : ఎంబీబీఎస్,ఎస్వీ మెడికల్ కళాశాల తిరుపతి
చరాస్తి విలువ : రూ.41,974
చేతిలో నగదు : రూ.40,000
బ్యాంక్‌లో నగదు : 1,974
భార్య పేరిట బంగారం:(400 గ్రాములు) విలువ రూ. 12లక్షలు
భార్య పేరిట మొత్తం ఆస్తుల విలువ: 1,20,00,000
భార్య పేరిట భవనాలు విలువ : 2,15,33,300
అప్పులు : లేవు
కేసులు: లేవు

'లెక్క'లు పక్కాగా ఉండాలి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల గణాంకాలు పక్కాగా ఉండాలని ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు వీజీ శేషాద్రి, మీనుఓలా తెలిపారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కౌంటర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా లెక్కలు పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. రూ.పది ఖర్చు చేసినా లెక్కలు చూపాలన్నారు. ఏ రోజు లెక్కల జాబితా ఆరోజే పంపాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ప్రచారాలకు, ప్రకటనలకు వాడే కంటెంట్‌కు ముందస్తు అనుమతి (ప్రీ సర్టిఫికేషన్) కోసం వచ్చిన దరఖాస్తులను ఎంసీఎంసీ కమిటీ పరిశీలించి 48 గంటల లోపు జిల్లా ఎన్నికల అధికారి ఆమోదంతో అనుమతులు ఇస్తామని వివరించారు. పెయిడ్ న్యూస్, సోషల్ మీడియా, ప్రింట్ మీడియాలో వస్తున్న ప్రకటనలు, న్యూస్‌లను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారంటూ కౌంటర్‌లోని అధికారులను ప్రశ్నించారు. మీడియా నోడల్ అధికారి, ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ బాల కొండయ్య రోజు వారి లెక్కలను వివరించారు. ఏరోజు నివేదికలు ఆరోజే ఆర్ఓ, ఎక్స్‌పెండిచర్ నోడల్ అధికారికి పంపుతున్నామని వివరించారు. జిల్లా ఎక్స్‌పెండిచర్ నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు, డివిజినల్ పీఆర్ఓ ఈశ్వరమ్మ, ఐఅండ్‌పీఆర్ సిబ్బంది, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంసీఎంసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎక్స్ అబ్జర్వర్లు శేషాద్రి, మీనుఓలా

అట్టహాసంగా బియ్యపు నామినేషన్

- అశేషంగా తరలివచ్చిన జనం
- శ్రీకాళహస్తి పట్టణంలో ఇసుకేస్తే రాలనంతగా నిండిన వైనం
- 'నేను లోకల్' ప్లకార్డుల ప్రదర్శన
- 'ఒకటే జెండా.. ప్రజాసంక్షేమమే ఎజెండా' అంటూ మీసం తిప్పిన క్యాడర్
- పాల్గొన్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



ప్లకార్డుతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట/శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి అశేష జన సమూహం నడుమ ర్యాలీగా వెళ్లి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం నామినేషన్ పర్వంలో పాల్గొన్నారు.

జనసంద్రం.. శ్రీకాళహస్తి పట్టణం

తన నామినేషన్ ర్యాలీకి పార్టీ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు తరలివచ్చి దీవించాలని ఎమ్మెల్యే పిలుపునివ్వడంతో శనివారం ఉదయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఆటోలు, ట్రాక్టర్లు, వ్యాన్లు, బైక్‌లు, కార్లలో పార్టీ శ్రేణులు, ప్రజలు పార్టీ జెండాలు చేతబట్టి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. పట్టణంలో ఏమూల చూసినా జన సమూహమే కనిపించింది. భారీ క్రేన్ల సాయంతో ఫలాలు, బెలూన్లతో తయారు చేసిన మాలలు వేసి ఆత్మీయంగా స్వాగతించారు. ఇంటి నుంచి బయల్దేరి అర్ధనారీశ్వరుని ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అక్కడ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న శ్రీ విజయగణపతి స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరారు. ఓపెన్ టాప్ వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

స్కూటీపై వెళ్లి నామినేషన్

ఆలయ భిక్షాల గోపురం వద్ద వేద విద్యార్థులు ఆయన్ను ఆశీర్వదించారు. అనంతరం నామినేషన్ దాఖలుకు సుముహూర్త ఘడియలు ఆసన్నం కావడంతో ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఓపెన్ టాప్ వాహనాన్ని దిగి అక్కడి నుంచి స్కూటీపై పొన్నాలమ్మ గుడివీధి మార్గంలో మార్కెట్‌యార్డ్ ప్రాంగణంలో ఉన్న ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలసి రిటర్నింగ్ అధికారి రవి శంకర్‌రెడ్డికి తన నామినేషన్ పత్రాలను, అఫిడవిట్‌ను అందజేశారు. అంతకుముందు ఆయన సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, తన సోదరుడు సామాను శ్రీధర్‌రెడ్డితో కలసి వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ వేశారు. ఈ ర్యాలీలో శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మ న్ అంజూరుతారక శ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, గుమ్మడి బాలకృష్ణ య్య, ఈరిబోయిన లోకేష్ యాదవ్, ఉన్నం వాసునాయుడు, బర్రె హేమ భూషణ్‌రెడ్డి, సీ.తిరుమలరెడ్డి, పగడాల రాజు, ఉత్తరాజి శరవణకుమార్, కూనాటి రమణయ్యయాదవ్, గున్నేరి కిషోర్‌రెడ్డి, రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, పేరూరు మునిరెడ్డి, గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, గాలి గుణశేఖర్‌నాయుడు, ప్రభాకర్, మహిళా నేతలు పసల సుమతి, సునీతాసింగ్, రుష్యేంద్రమణి, శారద, షాకిరబీ, షర్మిలా ఠాకూర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల ద్రోహి కిరణ్



- పదవి కోసం రాష్ట్ర విభజనకు సహకరించిన నీచుడు కిరణ్
- వైఎస్ఆర్ కుటుంబానికి వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు
- తాను తెలంగాణ వ్యక్తినంటూ అసెంబ్లీ సాక్షిగా కూతకూయలేదా?
- సీఎం పదవి కోసం చిదంబరం కాళ్లు మొక్కలేదా..!
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం

సాక్షి తిరుపతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఛీ కొట్టడంతో పదేళ్ల పాటు అజ్ఞాతంలో ఉండి తిరిగి బీజేపీ తరఫున ఎంపీగా పోటీ చేస్తున్న ఆంధ్రుల ద్రోహి కిరణ్‌కుమార్‌రెడ్డికి డిపాజిట్ సైతం దక్కదని మంత్రి, పుంగనూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో పుంగనూరులో 30ఏళ్ల అభివృద్ధిని కేవలం ఐదేళ్లలో చేశానన్నారు. గతంలో పోలీసులపైనే దాడి చేసి పుంగనూరు అల్లర్లకు కారకుడైన వ్యక్తిని చంద్రబాబు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడం దారుణమన్నారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు సోనియాగాంధీ కాళ్లకే మొక్కలేదని, కిరణ్‌కుమార్‌రెడ్డి కాళ్లు పట్టుకున్నానని సిగ్గుమాలిన, అబద్ధపు మాటలు మాట్లాడడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితంగా మెలుగుతూ ఆయన మరణానంతరం వైఎస్సార్ కుటుంబానికి వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు కిరణ్ అని మండిపడ్డారు. పదవీ వ్యామోహంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జైలులో పెట్టించి, రాష్ట్ర విభజనకు సహకరిస్తానని చిదంబరం కాళ్లకు మొక్కి సీఎం పదవి దక్కించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజనకు సహకరించి ఆంధ్రుల ప్రధాన ద్రోహిగా ముద్రవేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించి ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలో చేరి రాజంపేట ఎంపీగా అభ్యర్థిగా నిస్సిగ్గుగా పోటీచేస్తున్నాడని విమర్శించారు. పుటపర్తి సాయిబాబా సంపదను దోచుకునేందుకు ఆయన చనిపోయి పది రోజుల గడచినా బతికే ఉన్నారని యావత్ ప్రపంచాన్ని మోసం చేసి భౌతిక కాయాన్ని అక్కడే ఉంచిన అమానవీయ నీచుడు కిరణ్‌కుమార్ రెడ్డి అని ఆరోపించారు. తాను తెలంగాణలోనే పుట్టానని, తాను తెలంగాణ వ్యక్తినే అని కిరణ్ కుమార్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఆయనను సొంత తమ్ముడే జిల్లా నుంచే తరిమేశారని వెల్లడించారు. సమైక్యాంధ్ర పార్టీ పేరుతో చెప్పులు మెడలో వేసుకుని, ఆఖరి బాల్ తనదేనని ఆంధ్రులను నట్టేట ముంచిన ద్రోహి కిరణ్ అని పెద్దిరెడ్డి మండిపడ్డారు.

మే 14 నుంచి తిరుపతి గంగజాతర

- కోడ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలు
- దేవదాయశాఖ ఏసీ రామకృష్ణారెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయశాఖ ఏసీ రామకృష్ణారెడ్డి, ఈఓ మమత

తిరుపతి కల్చరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలక్షన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకలను మే నెలకు మార్పు చేసినట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామకృష్ణారెడ్డి వెల్లడించారు. శనివారం సాయంత్రం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మీడియా సమావేశంలో ఈవో కె.మమతతో కలిసి ఆయన గంగజాతర వివరాలను తెలియజేశారు. ఎన్నికల కోడ్ అమలుతో పాటు సెక్షన్ 144 అమలులో ఉండడంతో పోలీసు బందోబస్తు, రక్షణ కష్టతరం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమ్మవారికి పుట్టింటి సారె సమర్పించే అవిలాల వారు, జాతర చాటింపు చేపట్టే కైకాల వారు, అమ్మవారి విశ్వరూపం రూపొందించే ఆచారులతో పాటు ఆగమ పండితులతో చర్చించి వేడుకల తేదీ మార్పునకు నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

22న అమ్మవారి విశ్వరూప దర్శనం

ఆనవాయితీగా అమ్మవారి జాతరకు మే 7వ తేదీన అమ్మవారి పుట్టింటి నుంచి సారె తేవడంతో జాతర చాటింపు చేపట్టి 14వ తేదీన గంగమ్మ జాతర చేపట్టాల్సి ఉందన్నారు. కానీ ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా మే 14న అవిలాల నుంచి అమ్మవారి పుట్టింటి సారె తీసుకొచ్చి జాతర చాటింపు వేయనున్నట్లు తెలిపారు. 21వ తేదీన జాతర అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. 22వ తేదీన చేపట్టే అమ్మవారి విశ్వరూప దర్శనంతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర పరిసమాప్తమవుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని భక్తులందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ పొందిన మద్యం విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం రాత్రి ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ శాఖ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లలో జరిగే రోజువారి మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ సీఐ పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ దుకాణాల్లో అక్రమాలకు పాల్పడిన 15 మంది సూపర్‌వైజర్లు, 9 మంది సేల్స్‌మెన్లపై కేసులు నమోదు చేశారు.

వేధింపులు భరించలేక ఉద్యోగాలకు రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న వార్డు వలంటీర్లు

గూడూరు రూరల్: పవన్‌కల్యాణ్ మాటలతో తమ మనోభావాలు దెబ్బతినడంతో స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు ప్రకటించారు. ఈ మేరకు శనివారం గూడూరు పట్టణం, చెన్నూరు, నెల్లటూరు సచివాలయాల పరిధిలోని 130 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఆమేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాజశేఖరరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

– మహిళా కండక్టర్

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో చెంబేడు క్రాస్ రోడ్డు వద్ద శనివారం ముందు వెళుతున్న మోటారు బైక్‌ను లారీ ఢీకొట్టడంతో మహిళా కండక్టర్ కర్ణాటి మునికుమారి(47) అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ శ్రీకాంత్ సమాచారం మేరకు.. నాయుడుపేట మండలం, జువ్వలపాళెం గ్రామానికి చెందిన మద్దు సుందరరామయ్య శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి. భార్య మునికుమారి శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్. ఈ క్రమంలో విధులకు హాజర య్యేందుకు ఇద్దరూ శనివారం తెల్లవారు జామున మోటారు బైక్‌లో శ్రీకాళహస్తికి వెళుతున్నారు. మార్గ మధ్యంలో చెంబేడు క్రాస్ వద్ద నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న లిక్విడ్ కార్బన్‌డయాక్సైడ్ ట్యాంకర్ లారీ ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మునికుమారి తల మీదుగా లారీ ముందు చక్రం ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సుందరరామయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలుకు కుమారుడు తనూష్, కుమార్తె భాగ్యలక్ష్మి ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



రామకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ఈ చిత్రం చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం, రామకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం కింద భోజనం పెట్టించుకుంటున్న విద్యార్థులు. ఈ పాఠశాలలో 3 నుంచి పదో తరగతి వరకు 237 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 2019కు ముందు 145 మంది మాత్రమే విద్యార్థులు ఉండేవారు.అప్పటి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి, బడుల బలోపేతానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఎన్‌రోల్‌మెంట్ పడిపోయింది. అప్పట్లో రోజూ ఒకేరకమైన మెనూ ఉండడంతో విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందేది కాదు. 2019 తర్వాత సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకం రూపురేఖలు పూర్తిగా మారిపోయా యి. జగనన్న గోరుముద్ద పేరుతో ప్రభుత్వం వినూత్న పథకానికి పురుడుపోసింది. ఇది సూపర్ సక్సెస్ కావడంతో విద్యార్థులు రోజుకొక మెనూతో మ ధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా తింటున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.



వరదయ్యపాళెం జెడ్పీ హైస్కూల్‌లో..

ఈ చిత్రం తిరుపతి జిల్లా, సత్యవేదు నియోజకవర్గం, వరదయ్యపాళ్యం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం. ఈ పాఠశాలలో 2019కి ముందు 256 మంది విద్యార్థులుండేవారు. గతంలో ఉడికీ ఉడకని అన్నం వడ్డించేవారు. నాసిరకం ఆహారం తినలేక విద్యార్థులు పస్తులుండేవారు. కోడిగుడ్లు కూడా ఇచ్చేవారు కాదు. ఇదే పాఠశాలలో ప్రస్తుతం రోజుకొక మెనూ అమలవుతోంది. నాణ్యమైన బలవర్ధక ఆహారాన్ని విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. ఐరన్, కాల్షియం వంటి పోషకాలతో కూడిన రాగిజావను వారానికి మూడురోజులు తాగుతున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనం చాలా బాగుందని ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం ఆ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 592 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



తిరుపతి జిల్లా నరశింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

రోజుకో మెనూ.. ఇష్టంగా తిను!

పకడ్బందీగా జగనన్న గోరుముద్ద

- గత టీడీపీ పాలనలో ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారే గతి
- ఈ ఐదేళ్లలో ప్రభుత్వ బడుల్లో రోజుకో మెనూ
- తల్లిదండ్రులు, విద్యార్థుల హర్షం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో 2019–24 విద్యా సంవత్సరంలో జగనన్న గోరుముద్ద పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోంది. ఎదిగే చిన్నారులకు పౌష్టికాహారం ఎంత ముఖ్యమో ఆలోచించిన ప్రస్తుత సీఎం గోరుముద్ద పేరుతో రుచికరంగా రోజుకో మెనూను అమలులోకి తీసుకొచ్చారు. చిన్నారులను మరింత ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు అదనంగా రాగి జావ, చిక్కీలను అందజేస్తున్నారు. నాలుగంచెల విధానంలో సర్కారు బడుల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీనిపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా పచ్చపత్రిక విషం కక్కడంపై విరుచుకుపడుతున్నారు.

నాడు ఒకటే మెనూ..పెట్టిందే తిను!

టీడీపీ హయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నాసిరకం, ఉడికీ ఉడకని అన్నం పెట్టేవారు. రుచీపచీ లేని కూరలు వడ్డించేవారు. వారంలో అన్ని రోజులూ ఒకటే మెనూ ఉండేది. అలాంటి భోజనాన్ని విద్యార్థులు తినలేక బయట పడేసేవారు. బడికి కూడా సక్రమంగా వచ్చేవారు కాదు.



ఈనాడు పత్రికలో ప్రచురితమైన కథనం

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

సంవత్సరం	పాఠశాలలు	లబ్ధిపొందిన విద్యార్థులు	ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లల్లో
2021–22	4,805	3,18,212	రూ.45.28
2022–23 (చిత్తూరు జిల్లా)	2,458	1,62,856	రూ.26.13
2023–24 (చిత్తూరు జిల్లా)	2,461	1,63,170	రూ.32.36
2022–23 (తిరుపతి జిల్లా)	2,294	1,10,451	రూ.21.58
2023–24 (తిరుపతి జిల్లా)	2,294	1,45,013	రూ.38.15

నేడు వారానికి 15 రకాల వెరైటీలు

2019 నుంచి 2024 వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సర్కారు బడుల్లో గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. వారానికి 15 రకాల వెరైటీలు, ఐదు రోజుల పాటు కోడిగుడ్డు, 3 రోజులు చిక్కీ, మూడు రోజుల పాటు రాగి జావను అందజేస్తున్నారు. ఇలాంటి మెనూ దేశంలోని ఏ సర్కారు బడుల్లోనూ అమలు కావడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, అయ్యోర్లు చెబుతున్నారు. సకాలంలో వంట సహాయకులకు జీతం, క్రమం తప్పకుండా గోరుముద్ద పథకం బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

“ గతంలో ఒకటే మెనూ



నేను ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ బడిలోనే చదువుతున్నాను. నేను ప్రస్తుతం పి.కొత్తకోట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. ఇప్పుడున్న మధ్యాహ్న భోజనం నేను ఐదో తరగతి చదివేటప్పుడు ఉండేది కాదు. గతంలో ఒకే రకమైన సాంబారు, ఉడకని అన్నం పెట్టేవారు. నేను అసలు స్కూల్లో భోజనం తినేదాన్నే కాదు.

–చందనప్రియా, 9 వతరగతి, పూతలపట్టు మండలం, చిత్తూరు జిల్లా

ఇప్పుడే బాగుంది



మా పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగా పెడతారు. రోజుకొక వెరైటీ ఉంటుంది. గతంలో కంటే ఇప్పుడే బాగుంది. భోజనానికి అనుకూలంగా డైనింగ్ హాల్స్ ఏర్పాటు చేశారు. గతంలో నాశిరకమైన ఆహారంతో పాటు కనీసం కూర్చోవడానికి స్థలం కూడా ఉండేది కాదు. నేను ప్రతిరోజూ పాఠశాలలోనే భోజనం తింటాను.

– వీణ, బాలికల జెడ్పీ హైస్కూల్, కార్వేటినగరం, చిత్తూరు జిల్లా

బడిలో మినరల్ వాటర్



మా పాఠశాలలో ప్రతి రోజూ పోషకాలతో కూడిన భోజనం పెడుతున్నారు. రోజూ పెట్టే వెరైటీలు చాలా బాగాఉంటాయి. ఇలాంటి రుచికరమైన, నాణ్యమైన భోజనాలు గతంలో పెట్టేవారు కాదు. గతంలో అన్నం తినేటప్పుడు తాగునీరు కూడా ఉండేది కాదు. ఇప్పుడు మా పాఠశాలలో మినరల్ వాటర్ తాగుతున్నాను. – హారిక, 9 వ తరగతి, బాలికల జెడ్పీ హైస్కూల్, కార్వేటినగరం, చిత్తూరు జిల్లా

“ నాకు పలావు అంటే ఇష్టం



మా పాఠశాలలో గతంకంటే ప్రస్తుతం నాణ్యమైన ఆహారాన్ని పెడుతున్నారు. ప్రతి సోమవారం హాట్‌హాట్‌గా పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, వెజిటబుల్ పలావు, గుడ్డు కూర, చిక్కీ పెడుతున్నారు. నాకు పలావు అంటే చాలా ఇష్టం. ఎంతో ఇష్టంగా తింటున్నా. – సంపత్, 9వ తరగతి విద్యార్థి, పుత్తూరు, తిరుపతి జిల్లా

రాగిజావ చాలా బాగుంది



మా పాఠశాలలో అందజేస్తున్న రాగిజావ చాలా రుచికరంగా ఉంటోంది. వారంలో మూడు రోజుల పాటు రాగిజావ ఇస్తున్నారు. రెండో సారి వెళ్లి అడిగినా ఇస్తారు. గతంలో అన్నం, సాంబారు తప్ప ఇంకేమీ ఇచ్చేవారు కాదు. కోడిగుడ్డు ఒక్కోసారి ఇచ్చేవారు లేకపోతే అదికూడా లేదు. – హేమశ్రీ, 8 వతరగతి, పుత్తూరు మండలం, తిరుపతి జిల్లా

వెజిటబుల్ అన్నం భలే ఇష్టం



మా బడిలో వెజిటబుల్ అన్నం పెడతారు. ఆ అన్నం అంటే నాకు చాలా ఇష్టం. చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో కంటే పాఠశాలలోనే బాగా ఉంటుంది. కోడిగుడ్డు, చిక్కీ కూడా క్రమంతప్పకుండా ఇస్తారు. రాగిజావ కూడా తాగుతాను. ఉడికించిన కోడిగుడ్డు తింటే ఎములకు బలాన్ని పెంచుతుందని మా మేడం చెప్పింది.

– భావన, 2 వ తరగతి, పూతలపట్టు మండలం, చిత్తూరు జిల్లా